ప్రతి అక్షరం - ప్రజల కోసం
రోమింగ్ న్యూస్
తెలుగు దినపత్రిక
శుక్రవారం
11 జూలై
2025





# భారతీయ విద్యా పునరుజ్జీవన దిశగా జాతీయ సదస్సు

**హాజరైన విద్యావేత్త కోమటి రెడ్డి గోపాల్ రెడ్డి**



**హరిద్వార్, రోమింగ్ న్యూస్:** పవిత్రమైన గురు పౌర్ణమి సందర్భంగా పతంజలి యోగపీఠం, హరిద్వార్లో దేశవ్యాప్తంగా ప్రముఖ విద్యావేత్తలు, పాలసీ నిర్ణేతలు, పాఠశాలల నాయకులు సమావేశమై భారతీయ విద్యావ్యవస్థ పునరుద్ధరణపై జాతీయ స్థాయిలో గొప్ప దిశానిర్దేశక చర్చ జరిపారు. ఈ మహా సమావేశాన్ని యోగరుషి పూజ్య స్వామి రామ్‌దేవ్ బాబా జీ కీర్తిమానం చాటారు. స్వామి జీ అందరికీ ఆశీస్సులు అందిస్తూ, భారత భవిష్యత్తును మలచే గురువుల పవిత్ర పాత్రను గుర్తు చేశారు. భారతీయ శిక్ష బోర్డు చేస్తున్న ప్రయత్నాలను ఆయన హర్షంతో అభినందించి, సంస్కృతి, సదాచారం, స్వాభిమానం ఆధారంగా భారతీయ విద్యా విలువలను తిరిగి తీసుకురావాలన్నారు.

**ముఖ్య అతిథులు:**

డా. ఎన్పీ సింగ్ గారు – సీఈఓ, భారతీయ శిక్ష బోర్డు (BSB), డా. కుల్భూషణ్ శర్మ గారు – జాతీయ అధ్యక్షులు, నీసా (NISA), డా. లయన్ కోమటిరెడ్డి గోపాల్ రెడ్డి గారు – ప్రముఖ విద్యావేత్త, పర్యావరణవేత్త, TRSMA & NISA జాతీయ సలహాదారు, అనిల్ జీ – నీసా కార్యదర్శి, ఢిల్లీ, దేశవ్యాప్తంగా వచ్చిన సీనియర్ ప్రిన్సిపాళ్లు, విద్యా పరిశోధకులు, పాఠశాల ప్రతినిధుల

**చర్చ ముఖ్యాంశాలు:**

భారతీయ విద్యా మూలాలకు పునరజ్ఞానం

డా. ఎన్పీ సింగ్ గారు మాట్లాడుతూ, విదేశీ విధానాల ఆధీనంలో ఉన్న ప్రస్తుత విద్యావ్యవస్థను మార్చాల్సిన అవసరం ఉందన్నారు. వేదాలు, ఉపనిషత్తులు, సంస్కృతం, ఆయుర్వేదం, గురుకుల పద్ధతి మొదలైన భారతీయ జ్ఞాన సంపదను ఆధునిక శాస్త్రీయ విద్యతో కలిపి విద్యార్థులకు సమగ్ర అభివృద్ధి కలిగించడమే లక్ష్యమన్నారు. BSB బోర్డు కాదు, అది భారతీయ ఆత్మను మేల్కొలిపే ఉద్యమం" అని స్పష్టం చేశారు.

**విలువలు, నైపుణ్యాలు, స్థిరత్వం**

భవిష్యత్ లో ఎదురయ్యే సమస్యలైన వాతావరణ మార్పులు, నిరుద్యోగం, ఒత్తిడులు, నైతిక విలువల తగ్గుదల వంటి అంశాలకు పరిష్కారంగా విలువాధారిత, నైపుణ్య కేంద్రిత, సమగ్ర విద్య అవసరమన్నారు. BSB అభివృద్ధి చేసిన పాఠ్య ప్రణాళిక శాస్త్రీయ ఆలోచనలతో పాటు ఆధ్యాత్మిక విలువలను కూడా విద్యార్థులకు అందిస్తుందని తెలిపారు.

**ఉపాధ్యాయుడు - దేశ భవిష్యత్ స్తంభం**

డా. లయన్ కోమటిరెడ్డి గోపాల్ రెడ్డి గారు మాట్లాడుతూ, "దేశ అభివృద్ధికి బలమైన పునాది ఉపాధ్యాయుడే. ప్రాథమిక స్థాయి నుంచి ఉపాధ్యాయునికి గౌరవం, శిక్షణ, ప్రాధాన్యత ఇవ్వాలి" అని పిలుపునిచ్చారు. పాఠశాలలు "మార్పు ఆలయాలు" కావాలని పేర్కొన్నారు.



**జాతీయ స్థాయి సమన్వయం**

డా. కుల్భూషణ్ శర్మ గారు మాట్లాడుతూ, దేశవ్యాప్తంగా ఉన్న పాఠశాలలు, విద్యా సంస్థలు కలిసి ఉన్నతమైన బోధన విధానాలు, ఉపాధ్యాయ శిక్షణలపై సహకారం చేసుకోవాలని సూచించారు.

"విద్య మార్కులకంటే మిన్నగా మన దేశ ఆత్మను తీర్చిదిద్దే ప్రక్రియగా ఉండాలి" అన్నారు. BSB దిశలో తీసుకుంటున్న భారతీయతను గల దృక్పథాన్ని ఆయన మెచ్చుకున్నారు. భారతీయ శిక్ష బోర్డు – జాతీయ గుర్తింపు పొందిన విద్యా మార్గదర్శి

భారతీయ శిక్ష బోర్డు కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖ అంగీకారం పొందిన నేషనల్ బోర్డు. AIU సమానత్వంతో దేశవ్యాప్తంగా పాఠశాలలకు భారతీయ సాంప్రదాయాన్ని మరియు ప్రపంచ ప్రమాణాలను కలబోసిన విద్యను అందించే అవకాశాన్ని కల్పిస్తోంది.

**ప్రధాన తీర్మానాలు:**

1. భారతీయ శిక్ష బోర్డును దేశ వ్యాప్తంగా ప్రోత్సహించాలి
2. విలువలతో కూడిన ఉపాధ్యాయ శిక్షణను అమలు చేయాలి
3. ప్రాథమిక స్థాయి నుంచే నైపుణ్యాల అభివృద్ధికి ప్రాధాన్యత ఇవ్వాలి
4. గిరిజన, గ్రామీణ మరియు వెనుకబడిన ప్రాంతాల విద్యా సంస్థల అభివృద్ధికి చర్యలు తీసుకోవాలి
5. ప్రతి సంవత్సరం గురు పౌర్ణమి రోజును "జాతీయ విద్యా అంతర్యాన దినోత్సవంగా" ప్రకటించాలి
6. పతంజలి యోగపీఠం మరియు భారతీయ జ్ఞాన సంస్థలతో సమగ్ర భాగస్వామ్యం పెంపొందించాల.

**పూజ్య స్వామి రామ్‌దేవ్ జీ సందేశం**

"విద్య ద్వారా మాత్రమే దేశం నిజమైన వ్యక్తిత్వాన్ని నిర్మించుకుంటుంది. భారతీయతను ప్రోత్సహించే విద్యా మార్గంలో ముందుకు వెళ్తున్న విద్యా నాయకులకు నా ఆశీర్వాదాలు. ప్రతి విద్యార్థి, ప్రతి తరగతి గదిలో భారతీ-య జ్ఞానం వెలుగులా విరజిమ్మాలి

**డా. ఎన్పీ సింగ్ గారి ఉక్తి**

"భారతీయ శిక్ష బోర్డు కేవలం బోర్డు కాదు – అది భారత విద్యా పునరుజ్జీవన ఉద్యమం. మానవ విలువలతో కూడిన, శాస్త్రీయమైన, సంస్కృతిమంతమైన, ప్రపంచస్థాయికి తగిన భారతీయత కలిగిన తరం కోసం మేము కృషి చేస్తున్నాం. ఈ జాతీయ స్థాయి విద్యా సమావేశం, భారత విద్యా రంగాన్ని మార్పు దిశగా నడిపించేందుకు ఒక చారిత్రాత్మక మైలురాయిగా నిలిచింది. భారతీయ శిక్ష గౌరవాన్ని తిరిగి తెచ్చే, జ్ఞానం, నీతి, సామర్థ్యం కలిగిన భవిష్యత్ తరాలకు మార్గం సుగమం చేయడంపై ఐక్యంగా ప్రతిజ్ఞ చేయడం ద్వారా ఈ సమావేశం ముగిసింది.

# జనగామలో కాంగ్రెస్ లీడర్ తో పాటు ఆయన తల్లి హఠాన్మరణం

**ఆత్మహత్యగా చెబుతున్నప్పటికీ**

**అన్ని కోనాల్లో పోలీసుల దర్యాప్తు**

**అంత్యక్రియలలో పాల్గొన్న కాంగ్రెస్ నాయకులు**

**జంగా రాఘవరెడ్డి, కొమ్మూరి ప్రతాపరెడ్డి**





జనగామ, జూలై 10: (రోమింగ్ న్యూస్) జనగామ జిల్లా కేంద్రంలో కాంగ్రెస్ సీనియర్ నాయకుడు చారబుడ్ల దయాకర్ రెడ్డి (55) తో పాటు ఆయన తల్లి అహల్య (78) ఇద్దరు కూడా విగత జీవులై ఉండటాన్ని గురువారం ఉదయం పోలీసులు గుర్తించారు. వడ్లకొండ రోడ్ లో పాతగోదాముల వద్ద వారి నివాసంలో మృతదేహాలను చూసిన అక్కడి వారు పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారి మరణ వార్త ఒక్కసారి గా సోషల్ మీడియాలో గురువారం ఉదయం చెక్కర్లు కొడుతూ తల్లి కొడుకులు ఇద్దరు ఒకేసారి మరణించడం ఏంటని పలు రకాలుగా ఒకరికొకరు ప్రశ్నించుకోవడం జరిగింది. కాంగ్రెస్ నాయకుడు రామ్ దయాకర్ రెడ్డి కొద్దిరోజులుగా అనారోగ్యంతో బాధపడుతున్నారు ఈ క్రమంలో తల్లి కూడా కొంత అనారోగ్యం బారిన పడ్డట్టు తెలిసింది తల్లి తనకు సేవలు చేయలేక తాను తల్లికి సేవ చేయలేక మదనపడుతూ కృంగిపోతూ కృషిస్తూ మనోవేదనకు గురైనట్లు తెలుస్తుంది. రాజకీయాల్లో చు-రుకుగా పాల్గొంటూ కౌన్సిలర్ గా ఆపదలో ఉన్న వారికి తనవంతు సహాయం చేస్తూ అందరితో ప్రేమగా కలుపుగోలుగా ఉంటూ అవివాహతుడైన దయాకర్ రెడ్డి బ్రహ్మచారిగా ఉంటూ ఇన్నాళ్లు తల్లికి సేవలు చేసుకుంటూ ఉన్నప్పటికీ, ప్రస్తుత క్లిష్ట సమయాన్ని పరిస్థితులను తట్టుకోలేక రాగి జావలో విషం కలుపుకొని తాను తాగి మరియు తల్లికి కూడా తాగించి ఇద్దరూ తనువులు చాలించి ఉంటారని ఆయన సన్నిహితులు చెబుతున్నారు . ఎంతో ధైర్యంగా ఉండే దయాకర్ ఇలా ఎందుకు చేస్తాడని అనుమానాలు కూడా పలువురు వ్యక్తం చేస్తున్నారు. ఏది ఎలా ఉన్నా పోలీసులు మాత్రం పోలీసులు జాగిలాలను రప్పించి అనుమానస్పద స్థితిలో కనిపిస్తున్న జంట మరణాలకు గల కారణాలను అన్వేషించే పనిలో ఉన్నారు. మరణానికి గల కారణాలను పోస్టుమార్టం రిపోర్టు తదనంతరం మాత్రమే చెప్పగలమని పోలీసులు పేర్కొంటున్నారు. దయాకర్ రెడ్డి తండ్రి గతంలోనే మరణించగా ఒక అన్న హైదరాబాద్లో ఉంటున్నట్లు, అక్క చెల్లెలు దయాకర్ రెడ్డి కి లేరని తెలిసింది. ప్రజా సమస్యలపై ధైర్యంగా గొంతెత్తి నిలదీసే తత్వం ఉన్న దయాకర్ అన్ని వర్గాల ప్రజలకు అన్ని పార్టీ ల వారి తో చాలా అన్యోన్యంగా ఉండేవారు. జిల్లా వ్యాప్తంగా ఈ జంట మరణాల వార్త తెలియడంతో కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు జంగా రాఘవరెడ్డి తో పాటు జిల్లా ఇంచార్జ మాజీ ఎమ్మెల్యే కొమ్మూరి ప్రతాపరెడ్డి, జనగామ మాజీ మున్సిపల్ చైర్మన్లు ఎర్రమల సుధాకర్, వేముల సత్యనారాయణ రెడ్డి, కాంగ్రెస్ జిల్లా నాయకులు చెంచారపు శ్రీనివాస్ రెడ్డి, తాటి కుమార్ తదితరులతోపాటు తెలుగుదేశం టిఆర్ఎస్ బిజెపి నాయకులు, ఇతర ప్రముఖులు అనేకమంది గురువారం రాత్రి జరిగిన అంత్యక్రియలలో పాల్గొన్నారు. ఏది ఏమైనప్పటికీ ఆరోగ్యాల పట్ల అత్యంత జాగ్రత్తగా ఉండాలని దీనికి తోడు మానసిక ధైర్యాన్ని ఎట్టి పరిస్థితుల్లో కూడా కోల్పోవద్దని ఈ సందర్భంగా పలువురు చర్చించుకోవడం కనిపించింది. దివంగత ఆత్మలకు శాంతి చేకూరాలని కోరుతూ కాంగ్రెస్ నాయకులతోపాటు అనేకమంది అంత్యక్రియలలో పాల్గొని నివాళు లర్పించారు.

# నేటి నుండి కాళికామాత బోనాల ఉత్సవాలు ప్రారంభం

**13న కాళికామాత బోనాలు**

**కరపత్రం ఆవిష్కరించిన కమిటీ**



**నకిరేకల్:** పట్టణంలోని శ్రీ శ్రీ స్వయంభు కాళికామాత దేవాలయం 13వ సంవత్సర బోనాల పండుగ మహోత్సవం 13 జులై 2025 ఆదివారం శ్రీ స్వయంభు కాళికామాత అమ్మవారి బోనాల పండుగను ఘనంగా నిర్వహించేందుకు ఆలయ కమిటీ ఏర్పాట్లు చేస్తోంది అందులో భాగంగా తొలి రోజు శుక్రవారం ఈనెల 11వ తేదీ నుండి ఉదయం 5 గంటల నుండి 13వ తేదీ వరకు మూడు రోజులపాటు ఘనంగా జరగనున్నాయి కాళికామాత బోనాల ఉత్సవాల సందర్భంగా ప్రత్యేక పూజ కార్యక్రమాలు అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించనున్నారు గురువారం ఆలయంలో బోనాల పండుగకు సంబంధించిన కరపత్రాన్ని ఆలయ కమిటీ ప్రతినిధులు ఆవిష్కరించారు ఈ కార్యక్రమంలో శ్రీ స్వయంభు కాళికామాత దేవాలయ వ్యవస్థాపక అధ్యక్షులు బ్రహ్మదేవర రవిశంకర్ గౌరవ అధ్యక్షులు కందాల నారాయణరెడ్డి ఆలయ చైర్మన్ గర్రె మురళి దీకొండ ప్రకాష్ కొండేటి శ్రీనివాస్ ఊర శ్రీను ఉయ్యాల శ్రీనివాస్ చందుపట్ల వేణు మాధవ్ మారుతా నాగయ్య అంబేద్కర్ ఎల్లపు రెడ్డి శ్రీనివాస్ రెడ్డి దాసరి రామచంద్రయ్య పల్లెర్ల యాదగిరి కుక్కడపు గోపయ్య తదితరులు పాల్గొన్నారు.

# ప్రధాన సర్కిళ్లలో దేవుళ్ళ విగ్రహాల ఏర్పాటుకు సన్నాహాలు



యాదగిరిగుట్ట, రోమింగ్ న్యూస్: తెలంగాణ తిరుమలగా విరాజిల్లుతున్న యాదగిరిగుట్ట శ్రీలక్ష్మీనరసింహస్వామి కొలువై ఉన్న యాదగిరికొండ చుట్టూ ఉన్న ప్రధాన సర్కిళ్లలో దేవుళ్ళ విగ్రహాల ఏర్పాటుకు సన్నాహాలు షురూ అయ్యాయి. ఇందులో భాగంగా ఆలయ ఈవో వెంకటరావు గురువారం కొండపైన ఆలయ అధికారులతో సమావేశం నిర్వహించారు. అనంతరం విగ్రహాలు ఏర్పాటు చేయనున్న సర్కిళ్లను క్షేత్రస్థాయిలో తిరిగి పరిశీలించారు. పాతగుట్ట సర్కిల్ లో గరుడ, వైకుంఠ ద్వారం సర్కిల్ లో అభయాంజనేయ స్వామి, మల్లాపురం సర్కిల్ లో రామానుజ, ప్రెసిడెన్షియల్ సూట్ సర్కిల్ లో యాదరుషి, ఘాట్ రోడ్డు సర్కిల్ లో ప్రహ్లాదుని విగ్రహాలు ఏర్పాటు చేయాలని ఇప్పటికే నిర్ణయం తీసుకోగా.. సాధ్యాసాధ్యాలపై ఆలయ అధికారులు, స్థపతి, శిల్పులతో కలిసి సర్కిళ్లను ఈవో వెంకటరావు గురువారం గ్రౌండ్ లెవల్ లో పరిశీలించారు. కొండ చుట్టూ ఉన్న రింగు రోడ్డుకు మధ్య మధ్యలో ఉన్న మొత్తం ఐదు సర్కిళ్లలో ఏర్పాటు చేసే దేవుళ్ళ విగ్రహాలు సిమెంట్ తోనా.? లేక రాతి విగ్రహాలు ఏర్పాటు చేయాలా.? అనే అంశంపై వారంలోగా తుది నిర్ణయం తీసుకోనున్నట్లు ఆలయ అధికార వర్గాల ద్వారా తెలిసింది. ఈ కార్యక్రమంలో డిప్యూటీ ఈవో భాస్కర్ శర్మ, సివిల్ విభాగం ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ దయాకర్ రెడ్డి, ఏఈవో రఘు, ఎండోమెంట్ స్థపతి వల్లి నాయగం, శిల్పి బాలసుబ్రహ్మణ్యం, ఆలయ అధికారులు ఉన్నారు.

# సాగుకు సరిపడా యూరియా అందుబాటులో ఉంది

**యూరియా స్టాక్ లేదనే వదంతులను రైతులు నమ్మొద్దు**

**యాదగిరిగుట్ట డివిజన్ ఏడీఏ శాంతినిర్మల**



యాదగిరిగుట్ట, రోమింగ్ న్యూస్:ఈ సీజన్ లో సాగు చేసిన పంటకు సరిపడా యూరియా అందుబాటులో ఉందని, యూరియా స్టాక్ లేదనే ప్రచారాన్ని రైతులు నమ్మవద్దని యాదగిరిగుట్ట డివిజన్ ఏడీఏ శాంతినిర్మల తెలిపారు. మోటకొండూర్ మండల కేంద్రంలో ఉన్న పలు ఫర్టిలైజర్ దుకాణాలను గురువారం ఆమె తనిఖీ చేశారు. స్టాక్ నిల్వల ధరల పట్టిక బోర్డ్, ధృవీకరణ పత్రాలు, స్టాక్ రిజిష్టర్లను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. యూరియా స్టాక్ లేదంటూ కొందరు కావాలనే వదంతులు సృష్టిస్తున్నారని పేర్కొన్నారు. పీఏసీఎస్ కేంద్రం, ప్రైవేట్ డీలర్ల వద్ద కలిపి మొత్తం 155 మెట్రిక్ టన్నుల యూరియా అందుబాటులో ఉందని, సరిపోను స్టాక్ లేదనేది పూర్తిగా అవాస్తవమని స్పష్టం చేశారు. అవసరం మేరకు రైతులు యూరియాను వినియోగించుకోవాలని, ఎరువులు కొనే చేసే సమయంలో ఆధార్ కార్డు, పట్టా పాస్ బుక్ జిరాక్స్ కాపీలు తీసుకురావాలని సూచించారు. యూరియా లేదని కొందరు కావాలని చేస్తున్న దుష్ప్రచారాన్ని రైతులు ఎట్టి పరిస్థితుల్లోనూ నమ్మొద్దన్నారు. ఆమె వెంట మోటకొండూర్ మండల అగ్రికల్చర్ ఆఫీసర్ రమాదేవి, వ్యవసాయ శాఖ సిబ్బంది తదితరులు ఉన్నారు.

# రద్దు చేసిన బస్సును వెంటనే పునరుద్ధరించాలి

**యాదగిరిగుట్ట బీజేపీ అధ్యక్షుడు కర్రె ప్రవీణ్, జిల్లా కార్యదర్శి కాదూరి అచ్చయ్య**

**యాదగిరిగుట్టలో ఆర్టీసీ బస్ డిపో ఎదుట బీజేపీ శ్రేణుల ధర్నా**




యాదగిరిగుట్ట, రోమింగ్ న్యూస్: యాదగిరిగుట్టలోని ప్రభుత్వ బాలికల వసతి గృహం నుండి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల వరకు నడిచే ఆర్టీసీ బస్సును తిరిగి పునరుద్ధరించాలని యాదగిరిగుట్ట బీజేపీ అధ్యక్షుడు కర్రె ప్రవీణ్, జిల్లా కార్యదర్శి కాదూరి అచ్చయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు గతంలో మాదిరిగానే యథాతథంగా బస్సు సర్వీసును తిరిగి నడపాలని డిమాండ్ చేస్తూ.. గురువారం యాదగిరిగుట్టలోని ఆర్టీసీ బస్సు డిపో ఎదుట బీజేపీ శ్రేణులతో కలిసి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. బస్సు సర్వీసును రద్దు చేయడం వల్ల స్కూల్ కు వెళ్లడానికి విద్యార్థినులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని తెలిపారు. ఉదయం హాస్టల్ నుండి స్కూల్ కు వెళ్లడానికి రెండున్నర కిలోమీటర్లు, సాయంత్రం తిరిగి హాస్టల్ కు చేరుకోవడానికి మరో రెండున్నర కిలోమీటర్లు కలిపి మొత్తం ఐదు కిలోమీటర్లు నడవాల్సి వస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. గతంలో బస్సు సదుపాయం ఉండేదని, కొత్త డీఎం వచ్చాక బస్సు సర్వీసును రద్దు చేశారని తెలిపారు. ఇదే విషయాన్ని కొత్తగా వచ్చిన డిపో మేనేజర్ మురళీకృష్ణ దృష్టికి పలుమార్లు తీసుకుపోయినా స్పందన లేకపోవడంతో.. తప్పని పరిస్థితుల్లో డిపో ముందు నిరసన తెలపాల్సి వచ్చిందని పేర్కొన్నారు. ప్రభుత్వ స్కూళ్లలోనే పిల్లలు చదువుకోవాలని ప్రభుత్వం ఓవైపు ప్రోత్సహిస్తుంటే.. క్షేత్రస్థాయిలో అధికారులు మాత్రం అందుకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఇకనైనా గర్ల్స్ హాస్టల్ నుండి స్కూల్ వరకు బస్సు సర్వీసును తిరిగి పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. లేకపోతే సమస్యను రాష్ట్రస్థాయికి తీసుకెళ్లి ఉద్యమం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా కార్యదర్శి కాదూరి అచ్చయ్య, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు గుంటుపల్లి సత్యనారాయణ, మండల ప్రధాన కార్యదర్శి నరేష్, మండల ఉపాధ్యక్షుడు గోపగాని ప్రసాద్ గౌడ్, ఉపాధ్యక్షుడు గౌలికార్ జవహర్, పట్టణ, మండల కమిటీ సభ్యులు తదితరులు ఉన్నారు.

